జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 31 9-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.
Contacts
తెలంగాణ
94911 34365



## బీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన స్కీములన్నీ బంద్

- పట్టణాల రోడ్లన్నీ గుంతలమయం
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

2లో



## ప్రగతి బాటలో కలిసి నడుద్దాం

- భారత్, మలేషియా నిర్ణయం కీలక రంగాల్లో పరస్పర సహకారం
- ద్వైపాక్షిక, వాణిజ్య బంధాలు బలోపేతం
- 11 ఒప్పందాలపై ఇరుదేశాల సంతకాలు
- ప్రధానులు మోదీ, ఇబ్రహీం విస్తృత చర్చలు

2లో




## మార్చి 31కల్లా నక్సలిజం అంతం

- కమ్యూనిజం నుంచి విముక్తి పొందాలి
- ఆ సిద్ధాంతం ఉన్న చోట అభివృద్ధి నిల్
- హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

రాయ్‌పూర్: కమ్యూనిస్ట్ సిద్ధాంతంపై హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సిద్ధాంతం వినాశకరమైందంటూ మండిపడ్డారు. కమ్యూనిజం ఉన్న చోట

మిగతా 2లో




# జిల్లాలను రద్దు చేయం..

- భూపాలపల్లి జిల్లా చెల్పూరు ప్రజాపాలన ప్రగతిబాట సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లాల పునర్విభజన చేయాల్సి వస్తే అసెంబ్లీలో చర్చిస్తాం
- బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి...
- ఇక నుంచి అలాగే పిలుస్తా.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను అరెస్ట్ చేసే వరకూ కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావే
- సింగరేణిపై బీఆర్ఎస్ విష ప్రచారం.. మెడికల్ బోర్డు రద్దు ఆలోచన లేదు

వరంగల్: 'పాత జిల్లాల మార్పు..కొత్త జిల్లాల ఏర్పాటుపై కొందరు విష ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను తీసివేయం.. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయం.. ఒకవేళ జిల్లాల పునర్విభజన చేయాల్సి వస్తే అసెంబ్లీలో చర్చకు పెడతాం. ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అబద్ధాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న వారిని నమ్మొద్దని, భూపాలపల్లి జిల్లా ఎటూపోదని.. జిల్లాల మార్పులపై ఎవరూ అపోహ పడొద్దని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతిబాట కార్యక్రమంలో సీఎం

మిగతా 2లో

### గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్...

# విచారణకు ఆదేశించిన సీఎం

- దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్
- 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
- ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
- విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో



# సాక్ష్యాలన్నీ సేఫ్

- హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం
- 'ఓటుకు నోటు' కేసు ఆధారాలు కాలిపోయాయన్నది అసత్యం
- సాక్ష్యాలన్నీ 2021లోనే కోర్టుకు ఇచ్చామన్న డైరెక్టర్ శిఖా గోయల్
- ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన మెటీరియల్స్ కూడా సురక్షితం
- కొన్ని డాక్యుమెంట్లు మాత్రమే కాలిపోయాయని, డేటాకు నష్టం లేదని స్పష్టీకరణ

2లో



## ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్రేనని కేటీఆర్ ఆరోపణ
- 'ఓటుకు నోటు' కేసు సాక్ష్యాలను నాశనం చేసేందుకే ఈ ఘటన అన్నారు
- ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్
- వేలాది క్రిమినల్ కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయని ఆందోళన

2లో

## అది కేసీఆర్ మొదలుపెట్టారు.. జగన్ కొనసాగించారు

- రాజకీయాల్లో అసభ్య పదజాలం వాడకం కేసీఆర్ నుంచే మొదలైందన్న ఏబీవీ
- కేసీఆర్‌ను గురువుగా భావించి జగన్ ఆ పరంపరను కొనసాగించారని ఆరోపణ
- తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వ్యాఖ్యలను ప్రస్తావించిన ఏబీ వెంకటేశ్వరరావు
- ఇద్దరి నేతలదీ ఎదుటివారిని అణచివేసే తత్వం అని విమర్శ
- ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా ఉండాలని సూచన

2లో

## విమర్శలు ఎదురైనప్పుడల్లా లడ్డూ అంశాన్ని వాడుకుంటున్నారు

- సిట్ నివేదికలో ఎలాంటి ఆధారాలు లేవని తేలినా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న కన్నబాబు
- రాజకీయాల కోసం తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారని ఆగ్రహం
- తమ హయాంలోనే 3,000 ఆలయాలు నిర్మించామని వెల్లడి
- తప్పుడు ఆరోపణలపై ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారని వ్యాఖ్యలు



2లో

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# విమర్శలు ఎదురైనప్పుడల్లా లడ్డూ అంశాన్ని వాడుకుంటున్నారు

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే తిరుపతి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా కీలక హామీలను నెరవేర్చలేక, విమర్శలు ఎదురైనప్పుడల్లా లడ్డూ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ, హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారని కన్నబాబు ఆరోపించారు. లడ్డూలో జంతు కొవ్వు కలిపారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని సిట్ బృందం విచారణ జరిపి, ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసినా అధికార కూటమి తప్పుడు ప్రచారం ఆపడం లేదని మండిపడ్డారు. వివాదానికి కారణమైన నెయ్యి నమూనాలను తమ కూటమి అధికారంలోకి వచ్చాకే సేకరించారని, అసలు బోలే బాబా డెయిరీకి అనుమతులు ఇచ్చిందే చంద్రబాబు గత ప్రభుత్వమని గుర్తుచేశారు. సిట్ నివేదికతో అబద్ధాలు బయటపడటంతో, ఇప్పుడు లడ్డూ తయారీలో 'టాయిలెట్ క్లీనింగ్ కెమికల్స్' వాడారంటూ చంద్రబాబు కొత్త ఆరోపణలు చేస్తున్నారని కన్నబాబు అన్నారు. జగన్‌ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవడానికే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో దాదాపు 3,000 ఆలయాలను నిర్మించామని, తిరుమల ఏడు కొండలను కాపాడామని తెలిపారు.

# మార్చి 31కల్లా నక్సలిజం అంతం

అభివృద్ధి మచ్చుకైనా కనిపించదన్నారు. అందుకే, ఆ భావజాలం నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడాలని కోరారు. వామపక్ష తీవ్రవాదంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో కమ్యూనిస్ట్ భావజాలం మనజాలదు. పశ్చిమబెంగాల్, త్రిపురల్లో కమ్యూనిస్టుల పాలన ముగిసింది. కేరళలో వారి ప్రభుత్వం చివరి ఊపిరి పీలుస్తోంది" అన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని శాంతి భద్రతల సమస్యగానో, అభివృద్ధి లోపంగానో చూడరాదని షా చెప్పారు. "ఇది సిద్ధాంతపరమైన సవాలు. వామపక్ష తీవ్రవాదం పెరగకమునుపు బస్తర్ ప్రాంతంలో శాంతి భద్రతలు పరిస్థితి యూపీ, బిహార్ కంటే మెరుగ్గా ఉండేవి. మరో పదేళ్లలో బస్తర్ దేశంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారనుంది" అన్నారు. "దేశంలో మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతం 90 శాతం మేర తగ్గిపోయింది. మార్చి చివరికల్లా దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తాం" అని అమిత్ షా నొక్కి చెప్పారు. "ఛత్తీస్‌గఢ్‌లో వందల సంఖ్యలో నక్సలైట్లు హతమయ్యారు. వేలాది మంది లొంగిపోయారు. మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలి. లొంగిపోయిన వారిని ప్రభుత్వం రెడ్ కార్పెట్‌తో ఆహ్వానిస్తుంది" అన్నారు. ప్రభుత్వం ఒక్క తూటా కూడా కాల్చాలనుకోవడం లేదని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన స్కీములన్నీ బంద్

సంగారెడ్డి: పట్టణాల్లో వీధిదీపాలను కూడా వెలిగించలేని మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన భాషతో వీధి రౌడీలా తయారయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పట్టణాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారితే, రేవంత్‌రెడ్డి మాత్రం కండ్లకు గంతలు కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో దోమల నివారణకు ఫాగింగ్ జరగడం లేదని.. కేవలం ఫ్రాడింగ్ మాత్రమే చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్కీములు బంద్ అయ్యాయని, స్కామ్‌లు మాత్రం జోరందుకున్నాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, గడ్డపోతారం తదితర ప్రాంతాల్లో 15 కార్నర్‌మీటింగ్‌లు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శల వర్షం కురిపించారు. తన తండ్రి వయసు ఉన్న కేసీఆర్‌ను పట్టుకుని కనీస గౌరవం లేకుండా, అతినీచమైన భాషను మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్‌ను దూషిస్తే నిరుపేదల కడుపులు నిండవని, సంక్షేమ పథకాలు అమలు చేస్తేనే పేదల కడుపులు నిండుతాయని సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తున్న కేసీఆర్‌ను జైలులో పెడతామని కాంగ్రెస్ అంటోందని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి రాసిచ్చిన బాండ్ పేపర్ బౌన్స్ అయిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఈ రెండున్నరేళ్ల పాలనలో కొత్త పథకాలు ఇవ్వకపోగా, బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను బంద్ చేశారని విమర్శించారు.

# ప్రగతి బాటలో కలిసి నడుద్దాం

కౌలాలంపూర్: ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, మలేషియా తీర్మానించుకున్నాయి. వాణిజ్యంలో అత్యధిక ప్రాధాన్య రంగాలతోపాటు పెట్టుబడులు, రక్షణ, ఇంధనం, తయారీ, సెమీకండక్టర్ల రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని, ప్రగతి బాటలో కలిసి నడవాలని నిర్ణయించాయి. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం భారత్, మలేషియా కట్టుబడి ఉన్నట్లు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆయన ఆదివారం మలేషియా పరిపాలనా రాజధాని అయిన పుత్రజయలో మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో సమావేశమయ్యారు. ఇరుదేశాల సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా భారత్, మలేషియా మధ్య 11 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. సెమీకండక్టర్ల రంగంలో ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంతోపాటు కీలక రంగాల్లో సహకారానికి సంబంధించిన ఒప్పందాలు ఇందులో ఉన్నాయి. భేటీ అనంతరం మోదీ, అన్వర్ ఇబ్రహీం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఉగ్రవాదాన్ని వారిద్దరూ తీవ్రంగా ఖండించారు. మానవాళికి శత్రువుగా మారిన ఉగ్రవాద భూతాన్ని సమాధి చేయడానికి ప్రపంచదేశాలన్నీ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరాటంలో తన వైఖరిని కుండబద్ధలు కొట్టినట్లు మోదీ బహిర్గతం చేశారు. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు గానీ, రాజీపడడం గానీ ఉండబోదని స్పష్టంచేశారు. భారత్‌మలేషియా మధ్య ప్రత్యేకమైన అనుబంధం ఉందని వివరించారు. ఇరుదేశాల ప్రజల మధ్య శతాబ్దాలుగా లోతైన, సౌహార్ద సంబంధాలు ఉన్నట్లు గుర్తుచేశారు. వ్యూహాత్మక విశ్వాసంతో ఇరుదేశాల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నట్లు చెప్పారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్...

# విచారణకు ఆదేశించిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లాలను రద్దు చేయం..

(మొదటి పేజీ తరువాయి)



పాల్గొన్నారు. హెలికాప్టర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖతో ముందుగా రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చేరుకున్న సీఎం.. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ రూ.63 కోట్లతో ఆలయ పునరుద్ధరణ, గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను సురేఖ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం చెల్పూరులో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలనప్రగతి బాట'బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జిల్లాల పునర్విభజనపై అందరి అభిప్రాయాలు తీసుకొని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే దీనిపైన ఆలోచిస్తామని, కుట్రలు, కుతంత్రాలతో విష ప్రచారం చేస్తున్న వారిని గమనించాలని పునరుద్ఘాటించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్‌ను అరెస్టు చేయకుండా అడ్డుపడుతున్నాడని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను అరెస్ట్ చేసే వరకు కిషన్‌రెడ్డిని కల్వకుంట్ల కిషన్‌రావనే పిలుస్తానని స్పష్టం చేశారు. రూ.వేల కోట్ల ఆస్తులను పేదలకు దానం చేసిన సోనియా, రాహుల్‌గాంధీని సీబీఐ, ఈడీ కేసుల పేరుతో వేధించి అవమానించలేదా? గాంధీ కుటుంబంపైన ఈడీ, సీబీఐని ఉపయోగిస్తున్నప్పుడు కాళేశ్వరంపైన సీబీఐ విచారణకు పంపిస్తే ఎవరు అడ్డుకుంటున్నారు'అని ప్రశ్నించారు. ఫెవికాల్ బంధంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును కిషన్‌రెడ్డి కంచె వేసి కాపాడుతున్నాడన్నారు. కేసీఆర్‌కు కేటీఆర్ సొంత కొడుకైతే.. కిషన్‌రెడ్డి దత్త పుత్రుడని చెప్పారు.

ఏప్రిల్ తర్వాత రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం'అని స్పష్టం చేశారు. 'కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ చెబుతున్నాయి. గల్లీలో మోరీలు కేసీఆర్ వచ్చి తీస్తాడా? కేసీఆర్, మోదీ బొమ్మలు చూపించి ఓట్లు అడగడానికే పనికి వస్తారు.. పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే సంసారం ఆగం అవుతుంది'అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో బోర్లబొక్కల పడుకున్న కేసీఆర్ నిధులు ఇవ్వడని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రూ.17,442 కోట్లు మంజూరు చేశామని స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు పర్యాటక ప్రాంతాన్ని రూ. 3, 4 వేల కోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు.

### సింగరేణిపై అపోహలు వద్దు..

సింగరేణి వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు రద్దు చేస్తారని విష ప్రచారం చేసే వారిని మోకాళ్లపై కూర్చొబెట్టాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రేవంత్ పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. 'బీఆర్ఎస్‌ను ఇక నుంచి బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి అని పిలుస్త. ఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ. వందల కోట్లు దోచుకున్నారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1,500 కోట్లు ఎవడబ్బ సొమ్ము'అని రేవంత్ ప్రశ్నించారు.


# ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో (ఎఫ్ఎస్ఎల్) శనివారం జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్ర పన్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత ఘటనే అని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం నాడు హనుమకొండలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఓటుకు నోటు' కేసు తుది తీర్పు దశకు చేరుకున్న సమయంలో, సాక్ష్యాలను శాశ్వతంగా నాశనం చేయాలనే దురుద్దేశంతోనే ఈ ప్రమాదాన్ని సృష్టించారని అన్నారు. అత్యంత భద్రత ఉండే ల్యాబ్‌లో, అదీ శీతాకాలంలో మంటలు చెలరేగడం, 24 గంటలూ సిబ్బంది ఉండాల్సిన చోట ఎవరూ లేకపోవడం వంటివి అనేక అనుమానాలకు తావిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. "ప్రారంభంలో స్వల్ప నష్టమే జరిగిందని అధికారులు చెప్పారు. కానీ ఆ తర్వాత 2015 నుంచి పదేళ్ల విలువైన సాక్ష్యాధారాలు పూర్తిగా కాలిపోయాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం కుట్ర అనే అనుమానాన్ని బలపరుస్తోంది" అని కేటీఆర్ వివరించారు. కేవలం ఒక అంతస్తుకు పరిమితమైన మంటలను ఆర్పేందుకు మూడున్నర గంటలకు పైగా సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు.

# అది కేసీఆర్ మొదలుపెట్టారు.. జగన్ కొనసాగించారు

రాజకీయాల్లో అసభ్య పదజాలం వాడే సంస్కృతికి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని, ఆ పరంపరను వైసీపీ అధినేత జగన్ ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగించారని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారని ఏబీ వెంకటేశ్వరరావు గుర్తుచేశారు. ఆనాడు ఉన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఆయన వ్యాఖ్యలను ఎవరూ గట్టిగా ఎదుర్కోలేకపోయారని అన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులపై విమర్శలు చేయడం సహజమే అయినా, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదప్రయోగాలు చేయడం కేసీఆర్ హయాంలోనే మొదలైందని ఆయన స్పష్టం చేశారు.

# సాక్ష్యాలన్నీ సేఫ్






హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో, గతంలో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు', 'ఫోన్ ట్యాపింగ్' కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయంటూ సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ తీవ్రంగా ఖండించారు. కీలక కేసులకు సంబంధించిన ఆధారాలన్నీ సురక్షితంగా ఉన్నాయని, ఎలాంటి డేటా నష్టం జరగలేదని ఆమె స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10:08 గంటల సమయంలో ల్యాబ్ కార్యాలయంలోని సీజ్డ్ ప్రాపర్టీస్ విభాగంలో మంటలు చెలరేగాయి. అక్కడి సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమైనప్పటికీ, మంటలు వేగంగా ల్యాబ్‌తో పాటు శిక్షణా కేంద్రానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొన్ని అనాలసిస్ డాక్యుమెంట్ ఫైళ్లు మాత్రమే దగ్ధమయ్యాయని, వాటిని కూడా రికవరీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని శిఖా గోయల్ వివరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

ముఖ్యంగా, తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపిన 2015 నాటి 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసమయ్యాయని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె తేల్చిచెప్పారు. ఆ కేసుకు సంబంధించిన 16 మెటీరియల్ ఆబ్జెక్టులను 2015లోనే స్వీకరించి, పరీక్షించిన తర్వాత 2021 మార్చిలోనే ఏసీబీ కోర్టుకు తిరిగి సమర్పించామని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ కేసుకు సంబంధించిన ఒక్క ఆధారం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేదని ఆమె తెలిపారు. అదేవిధంగా, ఇటీవలి ఫోన్ ట్యాపింగ్ కేసుకు (పంజాగుట్ట పీఎస్ క్రైమ్ నెం. 243/2024) సంబంధించి మార్చి 2024 నుంచి జనవరి 2026 మధ్య అందిన 132 మెటీరియల్ ఆబ్జెక్టులను పూర్తిగా పరిశీలించామని, వాటన్నింటినీ సురక్షితంగా వెలికితీశామని గోయల్ చెప్పారు. వాటి నివేదికలు ఇప్పటికే కొన్ని కోర్టుకు సమర్పించగా, మరికొన్ని సిద్ధమవుతున్నాయని అన్నారు. ఒకవేళ ఏవైనా డాక్యుమెంట్లు కాలిపోయినా, వాటి డేటాను తిరిగి పొందే సాంకేతిక సామర్థ్యం తమ బృందానికి ఉందని, ఆధారాల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ల్యాబ్‌లో కాలిపోయినవి ఇప్పటికే కోర్టులకు సమర్పించిన డాక్యుమెంట్ల కాపీలేనని, ఒరిజినల్స్ కోర్టు వద్ద భద్రంగా ఉంటాయని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అగ్నిప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# శ్రీ శ్రీ శ్రీ సరళ మైసమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

- అల్లాపురం దేవస్థాన అభివృద్ధికి గ్రామస్తుల తీర్మానం
- రెండేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గం ఎన్నిక
- అధ్యక్షుడిగా అర్ధ జనార్ధన్ రెడ్డి
- క్రమశిక్షణే లక్ష్యంగా కొత్త నిబంధనలు



**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, అల్లాపురం గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ సరళ మైసమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీని ఆదివారం గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు, యువత సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమ్మతితో నూతన కమిటీని ఏర్పాటు చేసి, ఆలయ అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కమిటీ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ ప్రజలు సూచించారు.

**నూతన కమిటీ సభ్యుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి:**

**గౌరవ అధ్యక్షులు:** టేకుల మంజుల దిలీప్ రెడ్డి, టేకుల శ్రీనివాస్ రెడ్డి, అర్ధ రాంచంద్రా రెడ్డి.

**అధ్యక్షులు:** అర్ధ జనార్ధన్ రెడ్డి. ఉపాధ్యక్షులు: రాసాల మహేందర్ యాదవ్, వరకాంతం వరలక్ష్మి శేఖర్ రెడ్డి, బొడ్డు పెద్ద గాలయ్య, యంజాల గాలయ్య. ప్రధాన కార్యదర్శులు: జినమోని యాదగిరి ముదిరాజ్, ఫక్కీరు నర్సింహారెడ్డి, బొడ్డు గాలయ్య, ముత్యాల లింగారెడ్డి, రుద్రాల యాదగిరి. కోశాధికారి: ఫక్కీరు భరత్ రెడ్డి. ప్రచార కార్యదర్శులు: టేకుల పెంటరెడ్డి, యంజాల వెంకటేష్, గుండేల కొమురయ్య, అర్ధ సత్తి రెడ్డి, వల్లపు యాదయ్య, బోయిని యాదయ్య, సుర్కంటి మోహన్ రెడ్డి, యంజాల చరణ్ రాజ్. కార్యదర్శులు: గూడూరు ఉపేందర్ రెడ్డి, బోయిని సుఖేందర్, కోమటిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గుదూరు రాంరెడ్డి, యంజాల యాదయ్య (స్వరూప), భూతం కిరణ్ యాదవ్. సహాయ కార్యదర్శులు: అర్ధ కరుణాకర్ రెడ్డి, రుద్రాల స్వామి, ఏనుగు అంజిరెడ్డి, సుర్కంటి సత్తిరెడ్డి, బొడ్డు యాదగిరి, గుండేల లింగస్వామి, రాసాల వినోద్ కుమార్ యాదవ్, రాచకొండ పూలమ్మ జంగయ్య, రాసాల మహిపాల్ యాదవ్, భూతం గణేష్ యాదవ్, బోయిని వినోద్ కుమార్ యాదవ్, భూతం శ్రీశైలం యాదవ్ (చిన్న), భూతం కల్పన జంగయ్య యాదవ్, ముత్యాల రవీందర్ రెడ్డి లు ఎన్నికయ్యారు. ఈ కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే ఉంటుందని నిర్ణయించారు. కమిటీ సభ్యత్వానికి రూ. 2500 చెల్లించి సభ్యత్వ ప్రమాణపత్రం తీసుకోవాలని తెలిపారు. కమిటీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వరుసగా రెండు సమావేశాలకు గైర్హాజరైతే మూడోసారి కమిటీ నుంచి తొలగించే నిబంధనను అమలు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే ఆలయ నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ప్రతి నెలా ఆదాయ - వ్యయాల సమీక్ష చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ ప్రజల అంగీకారంతో, అందరి సమక్షంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## ఉత్తమ మార్కులు సాధించేందుకు ఎస్ఎఫ్ఐ ప్రతిభ పరీక్షలు

- విద్యార్థులు పోటీ పరీక్షలు రాసేందుకు ఉత్సాహంగా ముందుండాలి : వేముల నాగరాజు
- విజయవంతంగా ముగిసిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్



**వలిగొండ, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులు, విద్యార్థినీల కోసం ఆదివారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ.. పరీక్షల పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని ఈ పోటీ ప్రపంచంలో ముందుండేలా ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని సూచించారు. వలిగొండ మండలంలో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు రెండు వందల మందికి పైగా విద్యార్థులు హాజరై పరీక్షను విజయవంతంగా రాశారని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉత్తమ మార్కులు సాధించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మైసొల్ల నరేందర్, జిల్లా నాయకులు బుగ్గ ఉదయ్ కుమార్, ఎండి ఫర్దిన్, బోనగిరి సాయి, సల్మాన్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి.. సమస్యలను పరిష్కరిస్తాం: పబ్బు రాజు గౌడ్



**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని రెండవ వార్డును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్ అభివృద్ధి చేసి చూపిస్తారని మునుగోడు ఎన్నికల ఇన్‌చార్జ్ పబ్బు రాజు గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలోని రెండవ వార్డులో గడపగడపకు ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట ప్రాంతంలోని ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని తెలిపారు. అలాగే పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రెండవ వార్డులో వీధి దీపాల ఏర్పాటు, అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాల స్థాపన, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్ల కల్పనకు కృషి చేస్తామన్నారు. అలాగే అర్హులైన వారికి కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, నాగేష్ గౌడ్, ఊదరి నరసింహ, దోనకొండ కృష్ణ, తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ భరోసా

**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పని చేస్తుందని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టసమయంలో ఫౌండేషన్ అందించిన సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేలు ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్, గుండె మల్లేష్ యాదవ్, కట్కూరి వెంకటేష్, నందగిరి జగత్, పగిల్ల యాదయ్య, నరసింహ, జంగయ్య, సురేష్, సిలివేరు శివ తదితరులు పాల్గొన్నారు.



## దైవ సేవలో తరించడం నా అదృష్టం

- సేవలో సాటిలేని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్
- నెల రోజుల్లోనే షెడ్డును పూర్తి చేసిన ఫౌండేషన్
- శ్రీ మోక్షలింగేశ్వర స్వామి ఆలయంలో షెడ్డుకు ఘన ప్రారంభం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్
- ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్





**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** దైవ సేవలో భాగస్వామ్యం కావడం తన జీవితంలో లభించిన అదృష్టమని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో ఉన్న శ్రీ మోక్షలింగేశ్వర స్వామి దేవాలయ గర్భగుడి ముందు భక్తుల సౌకర్యార్థం ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్డును ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎండ, వర్షం వంటి వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ స్వయంగా చొరవ తీసుకుని, ఇచ్చిన మాట ప్రకారం శంకుస్థాపన చేసిన నెల రోజుల లోపే షెడ్డును నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు, శివ స్వాములు, భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భాస్కర్ మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే భక్తులు సరైన వసతి సౌకర్యాలు లేక టెంట్లు వేసుకొని ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గమనించి, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే ఉద్దేశంతోనే ఈ షెడ్డును నిర్మించినట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, అలాగే ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడమే ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్, ఫౌండేషన్ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పట్టం కట్టండి

**బత్తుల వాణి విప్లవ్ గౌడ్, 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి**



**చౌటుప్పల్, ఫిబ్రవరి 08:** తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బత్తుల వాణి విప్లవ్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహాయ సహకారాలతో 13వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు, రైతుబంధు పథకం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా ప్రతి అర్హుడికి చేరేలా ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం తమ పార్టీకి చెందిన వారికి మాత్రమే పరిమితమై పని చేసిందని, దాదాపు పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రం అవినీతి, దోపిడీకి గురైందని విమర్శించారు. మళ్లీ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. 13వ వార్డులో ఉన్న ప్రధాన సమస్యలన్నింటినీ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో దశలవారీగా పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజల సమస్యలే తన ప్రథమ ప్రాధాన్యమని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని ఆమె స్పష్టం చేశారు.



## అవకాశం ఇవ్వండి.. ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా!

- కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం: బుడ్డా సురేష్

**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తనను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి బుడ్డా సురేష్ ఓటర్లను కోరారు. ఆదివారం వార్డులో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, గెలిచిన వెంటనే అవసరమైన చోట్ల బోర్లు వేయించి తాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని, దేశం తరహాలోనే రాష్ట్రాన్ని కూడా బీజేపీతోనే అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌడపూర్ మండల కేంద్రంలో జామ మసీద్‌ను ప్రారంభించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**(తొలివెలుగు): కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన జమ మసీద్ పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆదివారం ప్రారంభోత్సవంలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌడపూరు మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఉమ్మడి కుల్కచర్ల మండలం జెడ్పిటిసి కే రామదాసు నాయక్, చౌడపూర్ మాజీ సర్పంచ్ పాల నర్సింలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కృష్ణయ్య,ముస్లిం సోదరులు వాజీద్, సలీం,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం
9-02-2026

జనరల్ న్యూస్

Telangana

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





# అభివృద్ధి చేసే బాధ్యత నాది ఆశీర్వదించే బాధ్యత మీది

**నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

**చిట్యాల (తొలివెలుగు):** చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 09వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఎర్పుల పరమేష్ , 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సిలువేరు శేఖర్ చెయ్యి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజలను కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డుల్లో ఉన్న ప్రతి సమస్యను గుర్తించి, అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున అభివృద్ధి పనులకు ఎలాంటి అడ్డంకులు ఉండవని, ప్రజల సహకారంతో చిట్యాల మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం, గుడిపాటి లక్ష్మీ నరసింహ, మారగోని ఆంజనేయులు, పాటి మాధవరెడ్డి, బెల్లీ సత్తయ్య, పాటి నర్సిరెడ్డి, ఎస్కే ఇబ్రహీం, జగిని బిక్షం రెడ్డి, కొసనం అశోక్ ,ఓర్సు సైదులు, మధుసూదన్, దివాకర్ రెడ్డి , మహేందర్ రెడ్డి,సల్ల రాజు, ఖమ్మం పాటి సతీష్ ,కళ్లెం నరసింహ,జడల సుమన్ తదితరులు పాల్గొన్నారు

# రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

**గండిపేట (తొలివెలుగు):** లేబర్ కోడ్స్ కార్మికుల మెడకు ఉరితాళ్లు, కార్మికోద్యమానికి ముక్కుతాడు వేయడానికి లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు విమర్శించారు. రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ సర్కిల్ పరిధిలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పరప్వతాలు హజరై మాట్లాడుతూ ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. భారతదేశంలోని నేడు ఉత్పత్తి చేసుకోండి లాభాలు చేసుకోండి అని మన దేశ పెట్టుబడుదారులు కోరగా, నాడు పి.వి నుంచి మోడీ వరకు ఎగుమతులు చేసుకొండి లాభాలు కోసుకోండి అని కోరుతున్నారన్నారు. కీలకమైన సేవారంగం ఎగుమతులు సైతం 2024 22 కంటే 2022 డిసెంబర్ నాటికి దిగజారాయి దాని ఫలితమే ఐటీ సెక్టార్ రిటైన్స్మెంట్లు అన్నారు. ఈ సంకోభ దశలో తమ లాభాలు తగ్గిపోకుండా ఉండాలంటే కార్మికులపై దాడు ఒక్కటే పెట్టుబడిదారుల ముందున్న ఏకైక మార్గం అన్నారు. అందుకే నరేంద్రమోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందన్నారు. దేశంలోని మోడీ సర్కార్ పెంచిన వర్గ దాడిలో కోడ్స్ కీలకమైనవి ఉపాధి హామీ చట్టాన్ని ధ్వంసం చేసిందన్నారు. మూడు రైతుల నల్ల చట్టాన్ని దోడిదారిలో మళ్లి తెచ్చే పనిలో ఉందన్నారు. విత్తన చట్టం దానిలో ఒకటన్నారు. కష్టజీవులందరిపై కసిగా దాడి సాగుతుందన్నారు. మన దేశంలో కార్మిక వర్గం సంఘటితమవడం మొదలుపెట్టి దాదాపు 150 ఏండ్లు. ఏ చట్టాలు లేకముందే కార్మికులు సంఘటితమయ్యారు. పోరాడి కొన్ని చట్టాలు సాధించుకున్నారు. స్వాతంత్ర్యనంతరమే ఫ్యాక్టరీ చట్టం (1948) ద్వారా ఎనిమిది గంటల పని అమలులోకి వచ్చింది. మన దేశ కార్మిక వర్గం చేసిన నిరంతర పోరాటాల ఫలాలు మన దేశ కార్మిక చట్టాలు. స్వతంత్ర భారతావనిలో వచ్చిన కార్మిక చట్టాలన్నీ ఆ పోరాట ఫలితాలే ప్రభుత్వాల బిక్ష కాదని మండిపడ్డారు. మోడీ గుజరాత్ నుండి ఢిల్లీకి దిగుమతి చేసుకొని ప్రధాని పీఠంపై ప్రతిష్టుతుడైనాడు. ఆ కారణజన్ముడు కొద్దిమందికి అమృతభాండం చిలుకరిస్తూనే, కోట్లాదిమంది కష్టజీవులకు డ్రీప్ ఇరిగేషన్ (తుంపర సేద్యం) ద్వారా విషాన్ని విరజిముతున్నాడు. ఆ యొక్క విషయాన్ని మింగి చావడం కంటే తిరగబడడమే మన ముందున్న కర్తవ్యం అని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది.

# రామగుండం 41 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబును ఆదరిస్తున్న ప్రజల

**ఫిబ్రవరి 8, సిర్పూర్(టి) (తొలివెలుగు):** పెద్దపల్లి జిల్లా రామగుండం 41వ డివిజన్ తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ పార్టీ బలపరుస్తున్న రామగుండం 41వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు ను ప్రజలు ఆదరిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్ అన్నారు. డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు ప్రచారానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోలేటి శంకర్ గౌడ్, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇదునూరి నర్సింగ్ నాయకులు కార్యకర్తల తో కలిసి రామగుండం 41వ డివిజన్లో గడపగడపకు వెళ్లి టెలిఫోన్ గుర్తుకు ఓటు వేసి డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.... వృద్ధులను,మహిళలను,యువతి, యువకులను సబ్బండ వర్గాల ప్రజలను కలిసి డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు టెలిఫోన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించా లని విజ్ఞప్తి చేశామని అన్నారు. ప్రజల నుండి మంచి స్పందన ఉందని అన్నారు. డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు 41 వ డివిజన్ కార్పొరేటర్ గా గెలుపు ఖాయమని అన్నారు. టిఆర్ఎస్ డి పార్టీ వ్యవస్థాపకులు రాష్ట్ర నాయకులు నరాల సత్యనారా యణ నాయకత్వంలో టీఆర్ఎస్ డి పార్టీ రామగుండం 41 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి డాక్టర్ వాసం పల్లి ఆనంద్ బాబును కార్పొరే టర్ గా గెలిపిస్తే 41 వ డివిజన్ అభివృద్ధికై పాటుపడుతూ, అనారోగ్య మెడికల్ కారణంగా ప్రజలకు నిరంతరం ఒక ఎమర్జెన్సీ అంబులెన్స్ ను ఉచితంగా ప్రజల కొరకు డొనేట్ చేస్తామని అన్నారు. నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పనకు పాటుపడు తూ.ప్రభుత్వ ,రుణాలు అందేలా చూస్తామని అన్నారు. ఒంటరి మహిళలకు, వృద్ధాప్య,వితంతు పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల కల్పన తో పాటు డివిజన్ ను మెడల్ డివిజన్ గా అభివృద్ధికి పాటుపడతానని రామగుండం 41 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు అన్నారు.

# పదేళ్లు పాలించి పదుల సార్లు ఇదిగో అదిగో అన్న డబుల్ రోడ్డు

**ఇప్పుడు మేమే తెచ్చాము అని చెప్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు హాస్యాస్పదం**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి**



**ఆత్మకూరు(ఎం)(తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సెంట్రల్ లైటింగుతో పాటు డబుల్ రోడ్డు ఇదిగో వచ్చే అదిగో వచ్చే అని పదుల సార్లు పలు వార్త పత్రికలలో రాతలు రాయించుకొని ఇప్పుడు మేమే రోడ్డు వేయిస్తున్నట్లు, కలెక్టర్ నిధులతో వేయిస్తున్నట్లు వాట్సాప్ లలో మెసేజ్ లు,పలు వార్తా పత్రికలలో వార్తలు రాయించుకోవడం సిగ్గు చేటు , కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య సహకారంతో గత సంవత్సరం 2025 జనవరి లోనే 175 లక్షల నిధులతో రోడ్డు పనులను ప్రారంభించుకోవడం జరిగింది. అయితే రోడ్డు పనులలొ భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రస్తుత సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ఇంటి వద్దకు రోడ్డుపై వర్షం నీళ్ళు నిలుస్తాయని అందుకోసం సీసీ వేయాలని అధికారుల సూచన మేరకు ఎస్టిమేషన్ పెంచుతూ సీసీ రోడ్డు కోసం అదనంగా డిఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా మరో 80 లక్షల రూపాయల నిధులను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సహకారంతో మంజూరి ఇప్పించడం జరిగింది.దానికి మేమే నిధులు తెప్పించి రోడ్డు వేయిస్తున్నట్లు,ఆలేరు ఎమ్మెల్యే దగ్గరికి మరియు జిల్లా కలెక్టర్ దగ్గరికి బిఆర్ఎస్ నాయకులు వెళ్లినట్లుగా తామే నిధులు తెచ్చినట్లుగా మేమే రోడ్డు ప్రారంభిస్తున్నట్లు ఫోటోలు పెట్టి తప్పుడు మెసేజ్ లు వార్తలతో జనాలను తప్పు తోవ పట్టించడం సరైనది కాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బాషబోయిన పాపయ్య యాదవ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి,మాజీ ప్యాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్,మాజీ ప్యాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎద్దు వెంకటేశ్వర్లు, మాజి దేవస్థాన చైర్మన్ దొంతరబోయిన భాస్కర్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిత్తర్ల అనిల్, నాయకులు కొమిరెల్లి నర్సిరెడ్డి,సుంకరి నిరంజన్, బెజ్జరబొయిన సాయి, పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



**చౌటుప్పల్.(తొలివెలుగు):** రానున్న వార్షిక పరీక్షల్లో మానసిక ఒత్తిడి లేకుండా పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను రాయాలని, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతాను వెలికి తీయడం కోసమె ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ ,తిగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక అరవిందో జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రంను అరవింద జూనియర్ కళాశాల చైర్మన్ బత్తుల శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ... స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలలో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో సమస్యలే కాకుండా విద్యార్థులు దాగి ఉన్న సృజనాత్మక తీయడం కోసం నిరంతరం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని త్వరలో రాబోయే పదవ తరగతి పరీక్షలను ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ధైర్యంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని తల్లిదండ్రుల కళల్ని నిలబెట్టాలని అన్నారు. విద్యార్థులు ముందుగా భయాన్ని విడిచిపెట్టి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. చదివే అన్నింటికీ మూలమని ఉన్నతంగా చదివి జీవితంలో మంచి స్థానంలో ఉండాలని అన్నారు. ఉన్న తక్కువ సమయాన్ని ఎక్కువగా ఉపయోగించు కోవాలని సమయాన్ని వృధా చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ చేసే కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టులో 300 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరై పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి సాతిరి మనోజ్, మండల ఉపాధ్యక్షులు దోనూరు శ్రావణ్, ఈరిగి వరుణ్, నాయకులు మల్లేష్ నవదీప్ ,సృజన,చంద్రిక ప్రసన్న అనూష మనీషా శిరీష,కీర్తన, అనూష ఝాన్సీ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

**ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీతో పేదల చెంతకు ప్రజా పాలన - మంత్రి వివేక వెంకటస్వామి**

**మంత్రి వివేక్ వెంకటస్వామి తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో ఆర్డినేటర్ డా. సత్యం శ్రీరంగం**



**కూకట్ పల్లి,(తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీలోని కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పాశమైలారం, ఇస్నాపూర్, రుద్రారం, లక్డారం, చిట్కుల్ కార్నర్ మీటింగ్ లలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. వివేక వెంకటస్వామి, టి జి ఐఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్, ఇంద్రేశం కోఆర్డినేటర్ పారిజాత నరసింహ రెడ్డి తో కలిసి టీపీసీసీ అధికార ప్రతినిధి, ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో ఆర్డినేటర్ డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 1,2,3,4,5,6,7,8,9,10,11,12,13,14,15,16,17,18,19,20,21,22,23,24,25,26 వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కావలి పద్మ, రెడ్డి ప్రణీత, కంజర్ల శ్రీవాణి, నీలం కవిత మధు ముదిరాజ్, జ్యోతి సంగన్నగారి, సుంకరి రవీందర్, ముత్యాలు కల్లూరి, పటోళ్ల మాధవి నరేందర్ రెడ్డి, మంజలి అలివేణి, కొత్తగాది హనుమంత్, బురిగారి శోభ, గడ్డం శ్రీశైలం, గౌండ్ల భారతి, గడ్డం బాలమణి, కుమ్మరి నారాయణదాసు, కమ్మి రెడ్డి శరత్ చందర్ రెడ్డి, కేతావత్ వెంకటేష్, మన్నే రాఘవేంద్ర, లచ్చగౌని సరిత సుధాకర్ గౌడ్, జ్యోతి లక్ష్మారెడ్డి, బురిగారి అంజిరెడ్డి, గంగానోల్ల మల్లేశ్వరి, పెద్దబోదుల యాదయ్య, పెలిమేలి యదలక్ష్మీ, సందీప్ వర్ధన్ గౌడ్, భూయాన్కర్ నందీశ్వర్ ర్లను భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించబోతోంది. గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే రాష్ట్రంలో వెయ్యిరెట్ల అభివృద్ధి జరుగుతోంది. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వంలో పుష్కలంగా నిధులు మంజూరవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి, మహిళలకు వడ్డీలేని రుణాలు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి చేస్తున్న కృషి ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి చేయాలనే తలంపుతో ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరికి సంక్షేమానికి కృషి చేస్తుందని కొనియాడారు. మహా లక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ఉచిత బస్ ప్రయాణంతో పాటు పేదలకు గృహ లక్ష్మీ పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

# రైతాంగానికి అండగా నిలిచిన కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలి – మాజీ ఎంపీ నామ

**ఖమ్మం(తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి మంచి మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రజలను కోరారు. ఆదివారం నాడు బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కలిసి చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి, 18వ వార్డు అభ్యర్థి రాచబంటి శ్రీదేవి, 19వ వార్డు దామ ఉమ, 17వ వార్డు రాచర్ల పద్మ, 10వ వార్డు కిన్నెర కృష్ణ, 11వ వార్డు దొంతెబోయిన వెంకటేశ్వర్లుల విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆశీర్వాదంతో తాను రెండు సార్లు పార్లమెంట్‌కు వెళ్లడం జరిగిందన్నారు. పదిహేడవ లోక్‌సభలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాడి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టామన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో నాలుగు కోట్లతో శాంతినగర్ నుండి లాలాపురం వరకు బీటీ రోడ్ మంజూరు చేయించడంతో పాటు గ్రామంలో అనేక సీసీ రోడ్లు వేయించడం జరిగిందన్నారు. అలాగే నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా బోర్లు వేయించడం, మొదటిసారి ఎంపీ అయినప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక లక్ష గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బంధు, రైతు భీమా వంటి సంక్షేమ పథకాలను తీసుకువచ్చి రైతాంగానికి అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తాగు, సాగునీరు, విద్యుత్ కష్టాలు లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అంటేనే యూరియా కష్టాలు, రైతాంగానికి అవస్థలు అని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఆయన సూచనల మేరకు పార్లమెంట్‌లో కేంద్రంపై పోరాడి రాష్ట్ర రైతాంగానికి సరిపడా యూరియా నిల్వలు తీసుకువచ్చి అందుబాటులో ఉంచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను బాకీ కార్డుతో నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, వైరా నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ‘బంగ్లాదేశ్ హిందువులు పోరాడితే..”
## ఆర్ఎస్ఎస్ చీఫ్ కీలక వ్యాఖ్యలు..

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధిపతి మోహన్ భాగవత్ ఆదివారం బంగ్లాదేశ్ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాలోని హిందువులకు గట్టి సందేశం ఇచ్చారు. దేశంలో హిందూ జనాభా తమ హక్కుల కోసం పోరాడితే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మద్దతు లభిస్తుందని చెప్పారు. వర్లీలోని నెహ్రూ సెంటర్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన “100 ఇయర్స్ జర్నీ ఆఫ్ సంఘ్: న్యూ హారిజోన్” అనే కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రసంగించారు. 2024 ఆగస్టులో హింసాత్మక నిరసనల కారణంగా అప్పటి ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చారు. అప్పటి నుంచి అక్కడ హిందువులపై దాడులు మొదలయ్యాయి. ఇటీవల, విద్యార్థి నేత ఉస్మాన్ హాది మరణం తర్వాత హిందువుల్ని టార్గెట్ చేస్తూ పలు హత్యలు జరిగాయి. భారతదేశ సమస్యలపై స్పందించిన మోహన్ భగవత్.. భారతదేశంలో మారుతున్న జనాభా స్వరూపాన్ని పరిష్కరించడానికి గత ప్రభుత్వాలు కృషి చేయలేదని అన్నారు. ఈ మార్పులకు జననాల రేటు, అక్రమ వలసలు ప్రధాన కారణమని అన్నారు. భారతదేశాన్ని ఇప్పుడు విడగొట్టలేదని , అలా ప్రయత్నించే వారే విచ్ఛినమవుతారని ఆయన అన్నారు. ఏ కులం వారైనా ఆర్ఎస్ఎస్ చీఫ్ కావచ్చని, ఎస్టీ–ఎస్టీ కావడం అనర్హత కాదని, బ్రహ్మణుడు కావడం అర్హత కాదని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభంలో బ్రహ్మణులతో ప్రారంభమైనప్పటికీ, అన్ని కులాల కోసం పనిచేస్తోందని చెప్పారు.

## భారత్ దెబ్బకు రిపేర్లు చేయించుకుంటున్న పాకిస్తాన్..

**ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఎయిర్ బేసులపై దాడులు..**

**ఇప్పటికీ మరమ్మతుల పనులు చేయించుకుంటున్న వైనం..**

భారత్ పాకిస్తాన్ మధ్య గతేడాది మే నెలలో జరిగిన యుద్ధం ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. కేవలం 88 గంటల్లోనే పాకిస్తాన్‌ను భారత్ కాళ్ల బేరానికి తెచ్చింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన తర్వాత, భారత్ “ఆపరేషన్ సిందూర్” ప్రారంభించింది. పాక్, పీఓకేలోని లష్కరేతోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి, వందలాది మంది ఉగ్రవాదుల్ని హతమార్చింది. పాకిస్తాన్ సైన్యం కవ్వింపులకు పాల్పడితే, భారత వాయు సేన ఏకంగా పాక్ వైమానిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఏకంగా 10కి పైగా పాక్ ఎయిర్ బేసులు ధ్వంసమయ్యాయి. ఇదిలా ఉంటే, భారత్ చేసిన దాడుల తర్వాత ఇప్పటికీ పాకిస్తాన్ రిపేర్లు చేయించుకుంటుంది. పాక్ భోలారి ఎయిర్‌బేస్ పునర్నిర్మాణం ప్రారంభమైందని శాటిలైట్ ఇమేజ్‌లు చూపిస్తున్నాయి. 2025 మే 10న ఉదయం 10–12 గంటల మధ్యలో భారత్ ఎయిర్ ఫోర్స్ భోలారి ఎయిర్ బేస్‌పై మిస్సైల్ అటాక్ చేసింది. పాకిస్తాన్‌కు ఎంతో కీలకమైన సాబ్ 2000 ‘జుతీఅవఎవ’ ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ విమానం ఈ దాడిలో ధ్వంసమైనట్లు తెలుస్తోంది. భోలారి హ్యాంగర్ పూర్తిగా దెబ్బతింది. మురీద్, సుక్కూర్, నూర్ ఖాన్ ఎయిర్ బేస్ లు కూడా భారత దాడిలో తీవ్రంగా ధ్వంసమయ్యాయి. నూర్ ఖాన్ ఎయిర్ బేస్ పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలో ఉండటం గమనార్హం. మే 9 రాత్రి మొదలైన దాడుల్లో భారత వాయుసేన కనీసం 10 ప్రధాన పాక్ ఎయిర్ బేసుల్ని లక్ష్యంగా చేసుకుంది. రాఫెల్ యుద్ధవిమానాల నుంచి స్కాల్ప్ క్షిపణులతో విరుచుకుపడింది. సుఖోయ్ 30 వీఖ× నుంచి ఇజ్రాయెల్ రాంపేజ్ క్షిపణులను ఉపయోగించింది. మిరేజ్–2000 నుంచి క్రిస్టల్ మేజ్ క్షిపణులు, సుఖోయ్ ద్వారా బ్రహ్మోస్ ఎయిర్ టూ సర్ఫేస్ క్షిపణులను ప్రయోగించి ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. నూర్ ఖాన్, చక్లాలా, రఫీకీ, రహీం యార్ ఖాన్, సుక్కూర్, మురీద్, నయాచోర్ ఇలా పలు ఎయిర్ బేసులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి.



# కాంగ్రెస్ ఎంపీ, ఆయన భార్యకు పాక్‌తో సంబంధాలు..

- **కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఆయన భార్యపై సంచలన ఆరోపణలు..**
- **ఇద్దరికి పాకిస్తాన్ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నాయని సీఎం హిమంత వ్యాఖ్యలు..**

కాంగ్రెస్ ఎంపీ, అస్సాం పీసీసీ చీఫ్ గౌరవ్ గొగోయ్‌పై, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ ఆరోపణల తీవ్రతను పెంచారు. ఆయనకు, ఆయన భార్యకు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. గొగోయ్, ఆయన భార్య ఎలిజబెత్‌లపై కేంద్రం దర్యాప్తు సంస్థలు విచారణ జరపాలని అన్నారు. గొగోయ్ భార్య పాకిస్తాన్‌కు భారత రహస్య సమాచారాన్ని ఇచ్చిందని హిమంత ఆరోపించారు.

**అసలు కేసు ఏమిటి..?**

ఈ కేసు గౌరవ్ గొగోయ్ బ్రిటిష్ భార్య ఎలిజబెత్ కోల్‌బర్న్‌కు పాకిస్థాన్‌తో, ముఖ్యంగా పాక్ గూఢచార సంస్థ ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలకు సంబంధించింది. ఆమె పాకిస్తాన్ ప్రణాళిక సంఘం మాజీ సలహాదారు తౌకీర్ షేక్ వద్ద ఇస్లామాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు ఈ సంబంధాలు ఏర్పడ్డాయని అన్నారు. ఈ ఆరోపణల్ని దర్యాప్తు చేయడానికి ప్రభుత్వం ఒక సిట్ ఏర్పాటు చేసింది. సిట్ తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ కేసు సున్నితత్వం దృష్ట్యా కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని సీఎం హిమంత నిర్ణయించారు.

**సంచలన ఆరోపణలు:**

గౌరవ్ గొగోయ్, ఆయన భార్య ఎలిజబెత్ కోల్బర్న్‌లకు





పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. పాకిస్తాన్ కు చెందిన లీడ్ పాకిస్తాన్ నుంచి ఆమె జీతం కూడా తీసుకునేదని సీఎం వెల్లడించారు. ఎంపీ భార్యను పాక్ నియంత్రిస్తోందని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. ఎలిజబెత్ గతంలో యూఎస్ మాజీ సెనెటర్ టామ్ ఉడాల్, బిలియనీర్ జార్జ్ సోరోస్‌కు సహాయకురాలిగా పనిచేశారని అన్నారు. గొగోయ్ భార్య లో–ప్రొఫైల్ మెంటైన్ చేయడానికి పాకిస్తాన్‌లోకి అటారీ సరిహద్దు గుండా వెళ్లారని హిమంత చెప్పారు. గొగోయ్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత ఆమె 9 సార్లు పాకిస్తాన్ వెళ్లి వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందని అన్నారు. గొగోయ్ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి కూడా పాకిస్తాన్ సంస్థకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. 2013లో పాక్ పర్యటనలో గొగోయ్, ఆయన భార్య లాహోర్‌కు వెళ్లడానికి మాత్రమే అనుమతించారని, కానీ తర్వాత వారు ఇస్లామాబాద్, కరాచీ కూడా వెళ్లడానికి అనుమతించారని, దీని కోసం గొగోయ్ ఈవీసా కోరాడని సీఎం చెప్పారు. గొగోయ్ తన మైనర్ కుమారుడి కోసం బ్రిటిష్ పౌరసత్వం ఇప్పించడానికి 2022లో ఢిల్లీ పాస్‌పోర్ట్ ఆఫీస్‌లో అతడి పాస్‌పోర్టు అప్పగించారని హిమంత ఆరోపించారు. గౌరవ్ గొగోయ్ రాహుల్ గాంధీకి సన్నిహితుడిని, ఈ విషయాన్ని పరిశీలించి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలపై గౌరవ్ గొగోయ్ స్పందించారు. “సూపర్ ప్లాన్” అంటూ ఆన్‌లైన్ పోస్ట్ పెట్టారు. హిమంత మీడియా సమావేశం సీ–గ్రేడ్ సినిమా కన్నా దారుణంగా ఉందని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు అత్యంత తెలివితక్కువ, నిరాధారమైన విషయాలని అన్నారు.

# 114 రాఫెల్ జెట్‌ల కోసం భారత్–ఫ్రాన్స్ మధ్య ఒప్పందం..!



భారత్, ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఈ నెల చివర్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ పర్యటన ముందు డిఫెన్స్ అక్విజేషన్ కౌన్సిల్(ణూజ) దీనికి పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతగా ఉన్న ణూజ రాబోయే రోజుల్లో సమావేశం కానుంది. రక్షణ కార్యదర్శి నేతృత్వంలోని రక్షణ సేకరణ బోర్డు గత నెలలో ఇప్పటికే రాఫెల్ కనుగోలు ప్రతిపాదనను ఆమోదించింది.ఐఈ రాఫెల్ డీల్ ఓకే అయితే, భారత్ చరిత్రలోనే అతిపెద్ద యుద్ధ విమానాల సేకరణల్లో ఒకటిగా మిగులుతుంది. దీని విలువ సుమారుగా రూ. 3.25 లక్షల కోట్లు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీవ్రమైన స్క్వాడ్రన్ల కొరతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఈ డీల్ కుదిరితే భారత వాయుసేన సామర్థ్యం మరింత పెరుగుతుంది. పశ్చిమ, ఉత్తర సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. భారత్‌కు 42 స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు కావాలి, కానీ ప్రస్తుతం 29 మాత్రమే ఉన్నాయి. ఈ డీల్‌లో 18 విమానాలను ఫ్లై అవే స్టేటస్‌లో కొనుగోలు చేసే అవకాశం ఉంది, మిగిలిన వాటిని భారత్‌తో తయారు చేస్తారు. దాదాపు 80 శాతం విమానాలను దేశీయంగా ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియా ఫ్రేమ్ వర్క్ కింద స్వదేశీ కంటెంట్ 60 శాతానికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, 88 సింగిల్ –సీట్, 26–ట్విన్ సీట్ వేరియంట్లను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చేర్చుకుంటుంది. దస్సాల్ట్ ఏవియేషన్ స్థానిక తయారీ కోసం, భారతీయ ప్రైవేట్ రంగ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. రాఫెల్ జెట్‌లలో అధునాతన రాడార్స్, సెన్సార్లు ఉన్నాయి. ఇవి లాంగ్ రేంజ్ దాడి సామర్థ్యాన్ని కల్పిస్తాయి. మెటియోర్ బియాండ్ విజువల్ రేంజ్ క్షిపణి, స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణుల్ని రాఫెల్‌తో అనుసంధానించవచ్చు. ఆపరేషన్ సిందూర్ సమయంలో రాఫెల్ సామర్థ్యం ప్రత్యక్షంగా చూశారు.

# హర్యానాలో విషాదం.. కుప్పకూలిన స్వింగ్..



**హర్యానా సూరజ్‌కుండ్ మేళాలో విషాదం..**

**విరిగిపడిన స్వింగ్, ఒకరు మృతి..**

హర్యానాలో విషాదకరమైన ఘటన జరిగింది. ఫరీదాబాద్‌లో జరుగుతున్న సూరజ్‌కుండ్ మేళాలో స్వింగ్ కూలిపోయింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, 13 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తి ఒక పోలీస్. సాయంత్రం 6.15 గంటల ప్రాంతంలో దాదాపుగా 15 మంది ఊయలలో ఉన్నప్పుడు, యాంత్రిక లోపం కారణంగా విరిగిపోయింది. ఊయల కూలిపోయిన వెంటనే, ఆ ప్రదేశాన్ని అధికారులు ఖాళీ చేయించారు. జిల్లా కలెక్టర్, ఆయుష్ సిన్హా సహాయక చర్యలకు ఆదేశించారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ మరణించిన పోలీసుకు సంతాపాన్ని ప్రకటించారు. సూరజ్‌కుండ్ మేళా జనవరి 31న ప్రారంభమైంది మరియు ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతుంది.

## కుప్పకూలిన ప్రైవేట్ జెట్.. ముక్కలైన విమానం!

కర్ణాటకలోని విజయపుర జిల్లాలో రెడ్ బర్డ్ ప్రైవేట్ జెట్ విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం మంగళూరు గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘోర ప్రమాదంలో పైలట్, ట్రైనీ పైలట్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం స్థానిక పోలీసులు మాట్లాడుతూ.. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని, దర్యాప్తు పూర్తయిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులు మాట్లాడుతూ.. విజయపుర జిల్లా బాలాసోర్ తాలూకాలోని మంగళూరు గ్రామం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఒక జెట్ విమానం కూలిపోయింది. ప్రాథమిక దర్యాప్తులో విమానం కలబురగి సమీపంలో గాల్లో ఊగడం ప్రారంభించిందని తెలుస్తోంది. పైలట్ విమానాన్ని నియంత్రించడానికి ప్రయత్నించాడు, కానీ అది మంగళూరు సమీపంలోని పొలంలో కూలిపోయింది. విమానంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు, స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**ప్రమాదానికి కారణాలు ఏమిటంటే..**

విజయపురలోని మంగళూరు గ్రామ సమీపంలోని పొలంలో కూలిపోయిన జెట్ విమానంపై దర్యాప్తు ప్రారంభమైంది. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో ఇంధన కొరత ప్రమాదానికి కారణమని తేలింది. అయితే ఇంకా పోలీసులు ప్రమాదానికి కారణమైన వాటిపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రెడ్ బర్డ్ ఏవియేషన్ కూడా ప్రమాదానికి కారణాలను వెల్లడించలేదు. గాయపడిన వారిని పైలట్, ట్రైనీ పైలట్‌గా గుర్తించారు. రెడ్‌బర్డ్ ఏవియేషన్ భారతదేశంలోని ప్రముఖ విమాన శిక్షణ అకాడమీ. ఇది సెస్నా 172 టాంగో చార్లీ ప్రైవేట్ జెట్‌లో విమాన శిక్షణను అందిస్తుంది. శిక్షణ కోసం ప్రపంచ స్థాయి విమానాలను ఉపయోగిస్తుంది. ఈ అకాడమీ బారామతి, బెలగావి, సియోనిలోని శిక్షణా కేంద్రాల నుంచి పైలట్ శిక్షణను అందిస్తుంది.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## అభివృద్ధికి పట్టం కట్టండి.. దోపిడీకి కాదు!

**- 12వ వార్డులో పాక చిరంజీవి ఇంటింటి ముమ్మర ప్రచారం**



**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** అభివృద్ధికి పట్టం కట్టాలని, దోపిడీకి కాదు అని మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ పబ్బు రాజు గౌడ్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు అభ్యర్థి పాక చిరంజీవి తరఫున నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొని, వార్డు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, గృహ జ్యోతి, సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసి చెక్కులు వంటి సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. అలాగే సమస్య ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిస్తే తక్షణమే పరిష్కరిస్తారని తెలిపారు. వార్డు అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసే నాయకుడు పాక చిరంజీవి అని, ఆయనను గెలిపిస్తే అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని ప్రజలను కోరారు. వార్డు అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో సీతా రామచంద్రస్వామి దేవాలయ గుడి కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, మాజీ సర్పంచ్ బొంగు జంగయ్య గౌడ్, కంచరకుంట్ల వెంకట్ రెడ్డి, మాజీ వార్డు సభ్యురాలు బుంగపట్ల భారతమ్మ, మాజీ కౌన్సిలర్ సుల్తాన్ రాజు, వార్డు ఇన్‌చార్జిలు మాధగోని శేఖర్ గౌడ్, బక్క శ్రీనాథ్, తీగుళ్ల బాలరాజు, పార్టీ సీనియర్ నాయకులు తమ్మకొండ రాజు, మాస సుధాకర్, మానుపాటి వెంకటేశ్వర్, బొమ్మకంట శివ, సుల్తాన్ శేఖర్, జాజుల శివ, అల్లి కృష్ణ, సాయి, కంచరకుంట్ల శశిధర్ రెడ్డి, తేలుకుంట్ల నవీన్, మహిళా నాయకురాలు మాజీ ఉపసర్పంచ్ పాక పద్మ, బొబ్బిళ్ల సంధ్య, రెడ్డి లక్ష్మి, చిందం జ్యోతి, జిట్టం, కవిత, కౌసల్య, బుడ్డా దివ్య తదితరులు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదరించి ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

**- బీజేపీ 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య**

**- చౌటుప్పల్ మున్సిపాలిటీ 2వ వార్డులో ఇంటింటి ప్రచారం**



**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ పార్టీ 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య ఆదివారం గడపగడపకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదిస్తే, వార్డు అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అలాగే ప్రతి సమస్యను మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నిస్తానని అన్నారు. ఈ సందర్భంగా పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. నిజాయితీతో, పారదర్శకంగా పనిచేసే అవకాశం కల్పించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ నెల 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఆమె విజ్ఞప్తి చేశారు. ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ నాయకులు, మహిళా మోర్చా నాయకులు, యువ మోర్చా కార్యకర్తలు, వార్డు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అట్టహాసంగా 24వ వార్షిక వేడుకలు

- అన్న మెమోరియల్ పాఠశాల వార్షికోత్సవంలో ఎంఈఓ గురువారావు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- విద్యార్థులకు అవార్డుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి




**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అన్నా మెమోరియల్, ఇన్నోవేటివ్ హై స్కూల్‌ల 24వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి గురువా రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం పాఠ్యబోధనే కాకుండా సంస్కారం, క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్య అందించాలని సూచించారు. గత 24 సంవత్సరాలుగా చౌటుప్పల్ పట్టణంలో అనేక మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన స్కూల్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందజేసి ప్రోత్సహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా అన్నా-చెల్లెళ్ల అనుబంధం, తండ్రి-కూతుళ్ల మమకారంపై విద్యార్థులు వేసిన నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేయడంతో పాటు కన్నీళ్లు పెట్టించాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ చిన్నపరెడ్డి, పంతంగి మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, ఫాదర్ ఫ్రాన్సిస్ రెడ్డి, డాక్టర్ బెంజిమెన్, ఎలిజిబెత్, ఎస్సార్ అంబికా శాంత, స్కూల్ సిబిఎస్ఈ ప్రిన్సిపాల్ సునీత, స్టేట్ ప్రిన్సిపాల్ రాణి, కిరణ్ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.








# కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి

- కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రగతి శూన్యం
- ఎమ్మెల్యేకు పదవులపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు
- మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 8 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులే చౌటుప్పల్‌లో కనిపిస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మున్సిపాలిటీ అభివృద్ధిపై ఆసక్తి లేకుండా మంత్రి పదవిపై మాత్రమే దృష్టి ఉందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. 14వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి చింతల విజయలక్ష్మి దామోదర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. 14వ వార్డు అభివృద్ధి ఆమెతోనే సాధ్యమని, గత పాలకుల హయాంలో జరిగిన మున్సిపాలిటీ అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. చౌటుప్పల్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమని, ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. సంక్షేమ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని, చౌటుప్పల్ మున్సిపాలిటీని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీపై బీఆర్ఎస్ మిత్రపక్షాల జెండా ఎగురవేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలోనే చౌటుప్పల్‌ను మున్సిపాలిటీగా, ఆర్డీవో డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, సీసీ రోడ్లు, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి కీలక అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని తెలిపారు. మున్సిపాలిటీ చైర్మన్ పీఠం బీఆర్ఎస్ సొంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం 14వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి చింతల విజయలక్ష్మి దామోదర్ రెడ్డి మాట్లాడుతూడ తనను గెలిపిస్తే నాయకురాలిగా కాకుండా సేవకురాలిగా ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. 14వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





